అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..




మూడేళ్లుగా చేయూత కోసం ఎదురుచూపులు..!

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -57 గురువారం 30 జులై 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు 5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## తెలంగాణ ప్రాజెక్టులకు భారీ ఊరట

### పర్యావరణ అనుముతులు చెల్లుబాటు

### -సుప్రీంకోర్టులో ఉపశమనం



**న్యూఢిల్లీ,జూలై 29(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలోని పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు భారీ ఉపశమనం కల్పించింది. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండంను సుప్రీంకోర్టు కొట్టివేసినా.. ఆ ఉత్తర్వు ఆధారంగా ఇప్పటికే మంజూరైన పర్యావరణ అనుమతులన్నీ పూర్తిగా చెల్లుబాటులోనే ఉంటాయని స్పష్టం చేసింది. ఈ తీర్పు భవిష్యత్తుకు

మిగతా 2లో.

## ఉత్తరాంధ్రలో ఏనుగుల దాడులకు చెక్..

### కుంకీ శిబిరాన్ని ప్రారంభించిన పవన్ కల్యాణ్

**పార్వతీపురం మన్యం జిల్లా గుచ్చిమిలో కుంకీ ఏనుగుల శిబిరం ప్రారంభం**



**అమరావతిజూలై 29(జర్నలిస్ట్ వార్త):** ఉత్తరాంధ్రలో ఏళ్ల తరబడి రైతులను, ప్రజలను భయపెడుతున్న ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఏర్పాటు చేసిన కుంకీ ఏనుగుల శిబిరాన్ని ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ-అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ బుధవారం ప్రారంభించారు. వన్యప్రాణుల సంరక్షణతో పాటు ప్రజల ప్రాణాలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.

మిగతా 2లో.



## ఆర్ఎస్ఎస్ నియంత్రణలో విద్యావ్యవస్థ

**లోక్‌సభలో రాహుల్ ఫైర్: అమిత్ షా, ఆరెస్సెస్‌పై తీవ్ర ఆరోపణలు**

**లోక్‌సభలో అమిత్ షా, ఆర్ఎస్ఎస్‌ను టార్గెట్ చేసిన రాహుల్ గాంధీ**

**విద్యార్థులపై పోలీసుల చర్యకు హోంమంత్రి ఆదేశాలిచ్చారని వ్యాఖ్య**

**ఆధారాలు లేకుండా మాట్లాడొద్దని, క్షమాపణ చెప్పాలని కేంద్రం డిమాండ్**

**న్యూఢిల్లీ,జూలై 29(జర్నలిస్ట్ వార్త):** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ ప్రకంపనలు సృష్టించాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)ను లక్ష్యంగా చేసుకుని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యాఖ్యలపై అధికార పక్షం తీవ్రంగా స్పందించింది. ప్రశ్నపత్రాల లీకేజీ నిరోధక బిల్లుపై బుధవారం జరిగిన చర్చ సందర్భంగా సభలో ఈ వాగ్వాదం చోటుచేసుకుంది.

మిగతా 2లో.

# వానరాకతో రైతులకు ఊరట

## పలుచోట్ల ఉప్పొంగుతున్న వాగులు

**ప్రాజెక్టుల్లోకి భారీగా వరద..**

**దిగువకు విడుదల**

**సింగూర్‌కు స్వల్ప వరద ప్రవాహం**

**పొంగిపొర్లుతున్న ఘనపూర్ రిజర్వాయర్**

**పెద్దపల్లి జిల్లాలో అధిక వర్షపాతం**

**సింగరేణి బావుల్లో ఉత్పత్తికి ఆటంకం**




**హైదరాబాద్,జూలై 29(జర్నలిస్ట్ వార్త):** ఎల్‌నినో ప్రభావంతో వర్షాల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులకు రాష్ట్రంలో మూడ్రోజులుగా కురుస్తున్న భారీ నుంచి మోస్తరు వర్షాలు ఊరటనిస్తున్నాయి. కొన్నిచోట్ల భారీ వర్షం పడటంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో పంటలకు ప్రాణం పోసినట్టు కావడంతో రైతాంగంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు ఎగువ రాష్ట్రాల నుంచి కూడా వరద వస్తుండటంతో ప్రాజెక్టుల్లోకి నీరు చేరుతోంది. ఆ మేరకు అధికారులు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. పెద్దపల్లి జిల్లాలో సాధారణం కంటే ఏకంగా అధిక వర్షపాతం నమోదు కావడంతో జిల్లా యంత్రాంగం రెడ్ అలెర్ట్ ప్రకటించింది. సింగరేణి ఏరియాలోని బొగ్గు బావుల్లో ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. మరికొన్ని చోట్ల రహదారులు తెగిపోయాయి. లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో లోతట్టు, ప్రాజెక్టుల పరివాహక ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. మెదక్ జిల్లాలోని ఘనపురం రిజర్వాయర్ పొంగిపొర్లుతున్నది. సింగూరు ప్రాజెక్టులో ప్రస్తుత నీటి మట్టం 4.215 టీఎంసీలు కాగా ప్రాజెక్టులోకి 592 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోంది. దిగువకు 1877 క్యూసెక్కుల

మిగతా 2లో.

## పరీక్షల సవరణ బిల్లుకు లోక్‌సభలో ఆమోదం

**పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు 2026కు లోక్‌సభ ఆమోదం**

**పరీక్షల అక్రమాలకు పాల్పడితే 10 ఏళ్ల జైలు, రూ.10 కోట్ల వరకు జరిమానా**

**ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు.. మూడు నెలల్లోగా తీర్పునకు నిబంధన**

**నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థుల నిరసనలు, మంత్రి రాజీనామా నేపథ్యంలో ఈ పరిణామం**

**పరీక్షల వ్యవస్థలో పారదర్శకత పెంచడమే లక్ష్యమని ప్రభుత్వం వెల్లడి**



**న్యూఢిల్లీజూలై 29(జర్నలిస్ట్ వార్త):** దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన పరీక్షల పేపర్ లీకేజీలు, అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. ఇందులో భాగంగా 'పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు-2026'కు లోక్‌సభ బుధవారం ఆమోదముద్ర వేసింది. రెండు రోజుల పాటు వాడివేడిగా సాగిన చర్చల అనంతరం వాయిస్ ఓటు ద్వారా ఈ కీలక బిల్లును సభ ఆమోదించింది. పరీక్షల వ్యవస్థలో పారదర్శకతను పెంచడం, విద్యార్థుల భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా ఈ చట్టాన్ని తీసుకొచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. 2024 నాటి చట్టానికి సవరణలు చేస్తూ రూపొందించిన ఈ కొత్త బిల్లులో అత్యంత కఠినమైన నిబంధనలను చేర్చారు. దీని ప్రకారం పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే దోషులకు గరిష్ఠంగా 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష,

మిగతా 2లో.

## అత్యుత్తమ డిజిటల్ పౌరసేవల వేదికగా మీ-సేవ

### డిజిటల్ సేవల విస్తృతి, ప్రమాణ్యాలు పెంచాలి

### అధికారులతో ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు




**హైదరాబాద్,జూలై 29** ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభతరంగా, వేగవంతంగా, పారదర్శకంగా అందించేందుకు మీ-సేవ వ్యవస్థను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ పౌర సేవల వేదికగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు.

మిగతా 2లో.

## తెలంగాణ పోలీస్ శాఖలో భారీగా నియామకాలు

### మొత్తం 7,437 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల




**హైదరాబాద్,జూలై 29(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ పోలీసు శాఖలో భారీగా ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేసింది. మొత్తం 7,437 ఉద్యోగాల భర్తీ చేయనున్నట్లు తెలంగాణ పోలీసు నియామక మండలి వెల్లడించింది. ఈ మేరకు నాలుగు నోటిఫికేషన్లను విడుదల చేసింది. సివిల్, ఏఆర్, స్పెషల్ పోలీసు, జైళ్లు, ్ర÷ర్ విభాగాల్లో ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. కానిస్టేబుల్ (సివిల్) 3,697, కానిస్టేబుల్ (ఏఆర్)

మిగతా 2లో.

## సర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనండి

### కాంగ్రెస్ బిఎల్ఎలకు భట్టి ఆదేశం




**న్యూఢిల్లీ,జూలై 29(జర్నలిస్ట్ వార్త):** ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియను కాంగ్రెస్ బీఎల్ఏలు వేగవంతం చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసేందుకు యాక్షన్ ఎ÷-లాన్ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ ఎలక్షన్‌పై జిల్లా ఇన్‌చార్జ్, జిల్లా పీసీసీలతో చర్చించి ముగ్గురు సభ్యులతో ప్యానల్ ఏర్పాటు చేసి నివేదిక అందించాల్సి ఉంటుందని తెలిపారు. పౌరులుగా హక్కు ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని సూచించారు. బీఎల్ఏలు బాగా పనిచేస్తున్నారని

మిగతా 2లో.

## దేవాదాయ శాఖలో మరోసారి పదోన్నతుల పండుగ



### 48 మంది ఉద్యోగులకు ఈవోలుగా పదోన్నతి

**ప్రభుత్వ పనితీరుకు దేవాదాయ శాఖ పనితీరే నిదర్శనం**

**ఉద్యోగుల హక్కులను కాపాడటంలో ముందుంటాం -దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ**

**హైదరాబాద్,జూలై 29(జర్నలిస్ట్ వార్త):** దేవాదాయశాఖ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, అర్చకుల సంక్షేమం, దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణను అమలుచేస్తున్నామని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ గారు తెలిపారు. ఈ రోజు బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ఆడిటోరియం

మిగతా 2లో.

# ఆర్ఎస్ఎస్ నియంత్రణలో విద్యావ్యవస్థ

**మొదటిపేజీ తరువాయి**

భారత విద్యావ్యవస్థ ఆర్ఎస్ఎస్ గుప్పిట్లోకి వెళ్లిపోయిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి కేవలం నామమాత్రంగానే ఉన్నారని, తెరవెనుక అసలు వ్యవస్థను నడిపిస్తోంది ఆర్ఎస్ఎస్సేనని ఆయన విమర్శించారు. “ధర్మేంద్ర ప్రధాన్ కేవలం ఒక ప్రతీక మాత్రమే. మన విద్యార్థులకు అసలైన శత్రువు ఆర్ఎస్ఎస్“ అని ఆయన వ్యాఖ్యానించారు. విద్యార్థులు జ్ఞానం, సత్యాల దిశగా పయనించకుండా ఆర్ఎస్ఎస్ అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు.

కేంద్ర హోంమంత్రి అమిత్ షా లక్ష్యంగా కూడా రాహుల్ విమర్శలు గుప్పించారు. నీట్ అవకతవకలకు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో జూలై 20న విద్యార్థులు చేపట్టిన నిరసనపై జరిగిన పోలీసుల చర్యకు అమిత్ షానే బాధ్యుడని ఆయన ఆరోపించారు. “మన విద్యార్థులపై పెల్లెట్లు ప్రయోగించేందుకు హోంమంత్రే అనుమతి ఇచ్చారు. వారి శరీరాల్లోకి పెల్లెట్లు దిగేలా చేశారు“ అని రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పార్లమెంటును ఎదుర్కొనే ధైర్యం హోంమంత్రికి లేదని ఆయన ఎద్దేవా చేశారు.రాహుల్ గాంధీ చేసిన ఈ ఆరోపణలపై అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ, రాహుల్ గాంధీ నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని, సభకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైతం రాహుల్ సంయమనం పాటించాలని సూచించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులపై ఆరోపణలు చేసేటప్పుడు కచ్చితమైన ఆధారాలు చూపాలని స్పీకర్ ఓం బిర్లా స్పష్టం చేశారు. ఈ క్రమంలో సభలో తీవ్ర గందరగోళం నెలకొనడంతో స్పీకర్ సభను కొద్దిసేపు వాయిదా వేశారు.

# పరీక్షల సవరణ బిల్లుకు లోక్‌సభలో ఆమోదం

**మొదటిపేజీ తరువాయి**

రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అంతేగాక దోషుల ఆస్తులను జప్తు చేసే అధికారాన్ని కూడా ఈ చట్టం కల్పిస్తుంది. ఈ తరహా కేసుల విచారణను వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయనున్నారు. ఈ కోర్టులు మూడు నెలల వ్యవధిలోనే విచారణ పూర్తి చేసి తీర్పు వెలువరించాల్సి ఉంటుంది.ఇటీవల నీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా పెను దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా కఠినమైన చట్టం తీసుకువస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. ఆ తర్వాత కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు.

నీట్ అక్రమాలు, ఇతర పరీక్షల్లో అవకతవకాలపైన జులై 20న ‘కాక్‌రోచ్ జనతా పార్టీ‘ (సీజేపీ) ఆధ్వర్యంలో ఢిల్లీలో ‘సంసద్ చలో‘ పేరిట వందలాది మంది విద్యార్థులు భారీ నిరసన చేపట్టారు. ఈ ఆందోళన హింసాత్మకంగా మారడంతో పోలీసులు, నిరసనకారుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ పరిణామాల నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జులై 25న తన పదవికి రాజీనామా చేశారు. ఈ రాజకీయ ఒత్తిడి, దేశవ్యాప్త నిరసనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ కఠిన చట్టాన్ని తీసుకురావడం గమనార్హం.

# పని మాది.. ప్రచారం బాబుది

సోషల్ మీడియా వేదికగా జగన్ స్పందిస్తూ... “2019 ఎన్నికలకు సరిగ్గా నెల రోజుల ముందు ఎలాంటి అనుమతులు లేకుండా కేవలం ఒక శంకుస్థాపన రాయి వేసి ముచ్చట తీర్చుకోవడం తప్ప చంద్రబాబు చేసిందేమీ లేదు. కానీ 2020లో జీఎంఆర్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవడం నుంచి భూసేకరణ, భద్రతా అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన వరకు ప్రతీదీ వైసీపీ ప్రభుత్వ హయాంలోనే రూపుదిద్దుకున్నాయి“ అని స్పష్టం చేశారు.ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణను పూర్తి చేసి నిర్వాసితులకు పునరావాసం కల్పించడంతో పాటు నీరు, విద్యుత్, రోడ్ల కనెక్టివిటీ కోసం తమ ప్రభుత్వం ఏకంగా రూ.1200 కోట్లు ఖర్చు చేసిందని జగన్ అన్నారు. కోవిడ్ సంక్షోభం ఎదురైనా రన్‌వే, టెర్మినల్ పనులను వేగవంతం చేసి 2026 నాటికే విమానాల రాకపోకలు మొదలవుతాయని అప్పుడే ప్రకటించామని చెప్పారు. తాము పడ్డ కష్టానికి ఇప్పుడు ఫలాలు అందుతుంటే... ఏమీ చేయని చంద్రబాబు దొంగ క్రెడిట్ కొట్టేసేందుకు శాయశక్తులా తాపత్రయపడుతున్నారని ధ్వజమెత్తారు.

# రైతులకు ఊరట

**మొదటిపేజీ తరువాయి**

నీటిని విడుదల చేస్తున్నారు.

ఉమ్మడి కరీంనగర్..

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా రెండ్రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు ప్రధాన జలాశయాలకు సరికొత్త ప్రాణవాయువును అందించాయి. జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న వానలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. తాగు, సాగు నీటి అవసరాల నిమిత్తం కాళేశ్వరం లింక్-2 ద్వారా ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్‌హౌస్ మీదుగా రాజరాజేశ్వర జలాశయానికి (మిడ్ మానేరు) గోదావరి జలాల ఎత్తిపోతలను అధికారులు వేగవంతం చేశారు.

జలాశయాల్లోకి ప్రవాహం.. నీటి ఎత్తిపోతలు

ఎగువ ప్రాంతాల నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులకు వరద ప్రవాహం పెరిగింది. ఎల్లంపల్లికి వరద ఉధృతి ప్రమాదకరంగా మారింది. బుధవారం ఉదయం 11,735 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో, సాయంత్రానికి 66,126 క్యూసెక్కులకు చేరింది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 20.17టీఎంసీలు కాగా, ప్రస్తుతం 10.436 టీఎంసీలకు నీరు చేరింది. తాగునీటి అవసరాల కోసం ఎల్లంపల్లి నుంచి నంది పంప్ హౌస్ ద్వారా 4 మోటార్లను (ఒక్కోటి 3,150 క్యూసెక్కులు) ఆన్ చేసి 12,600 క్యూసెక్కుల నీటిని గాయత్రి పంప్‌హౌస్ (లక్ష్మీపూర్)కు తరలిస్తున్నారు. మానేరు, మూలవాగుల నుంచి మధ్యమానేరుకు ఇన్‌ఫ్లో 4,556 క్యూసెక్కులకు చేరింది. ప్రాజెక్ట్ సామర్థ్యం 27.55టీఎంసీలు కాగా, ప్రస్తుతం 7.576 టీఎంసీల నిల్వ నమోదైంది. మరోవైపు ఎస్సారెస్పీకి ప్రస్తుతం 3,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, నిల్వ 16.545 టీఎంసీలకు చేరింది. అప్పర్ మానేరుకు 1,400 క్యూసెక్కుల వరద వస్తుండగా నీటిమట్టం 1469.00 అడుగులకు (0.617టీఎంసీల)కు చేరింది.ఎడతెరిపిలేని



ముసురు..

పెద్దపల్లి జిల్లాలో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 66 వేల క్యూసెక్కులు దాటడంతో, ఎగువ నుంచి మరింత వరద వస్తే ఏ క్షణంలోనైనా క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. రామగుండం, మంథని ఏరియాల్లోని సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లోకి వర్షపు నీరు చేరడంతో బొగ్గు తవ్వకాలు, రవాణా ప్రక్రియకు తాత్కాలికంగా ఆటంకం ఏర్పడింది. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని మూలవాగు ప్రవాహంతో జయవరం, మల్లారం, హనుమాజీపేట, లింగంపల్లి గ్రామాల్లో ఎండిపోతున్న వరి నాట్లకు ప్రాణం వచ్చినట్టయింది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీ వరదలు

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. గోదావరి నదికి ఎగువన ఉన్న మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తుండటంతో వరద పరవళ్లు తొక్కుతోంది. భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో ఇన్‌ఫ్లో పెరిగింది. ములుగు జిల్లాలోని కన్నాయిగూడెంలోని సమ్మక్క సాగర్ బ్యారేజీలోనూ ఇన్‌ఫ్లో గణనీయంగా పెరిగింది. దేవాదుల ప్రాజెక్టు ఇన్‌టేక్‌వెల్ వద్ద గోదావరి నీటిమట్టం పెరిగింది. ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో వాగులు పొంగిపొర్లుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోనూ కురుస్తున్న వర్షాల కారణంగా భారీగా వరద వస్తుండటంతో రాచపల్లి పంచాయతీ మల్లాపురం వద్ద ఉన్న పాలెం ప్రాజెక్టు నిండింది. దీంతో అధికారులు ప్రాజెక్టు 4 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. కంకల వాగు కూడా ఉప్పొంగి ప్రవహిస్తోంది. కన్నాయిగూడెం మండలం సమ్మక్క సాగర్ బ్యారేజీకి భారీగా గోదావరి వరద చేరుతుంది. 20 గేట్లను తెరచి లక్షా 34 వేల 94 క్యూసెక్కుల వరదను కిందకు విడుదల చేశారు. అలాగే, జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో చంద్రుపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.

కృష్ణా నది ఎగువ పరివాహకంలో కుండపోత వర్షాలు

కృష్ణా నది ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న కుండపోత వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ఉధృతి గణనీయంగా పెరిగింది. విద్యుత్ అవసరాల కోసం ప్యారాలాల్ కెనాల్‌కు 600 క్యూసెక్కులు మొత్తం కలిపి 20,000 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. నారాయణపూర్ రిజర్వాయర్‌కు 62,171 క్యూసెక్కుల నీరు వస్తోంది. కిందికి 76,015 క్యూసెక్కులు వదులుతున్నారు. ఆల్మట్టి రిజర్వాయర్‌కు 68,525 క్యూసెక్కులు వస్తుండగా 64,613 క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నారు. శ్రీశైలం రిజర్వాయర్ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా జూరాల నుంచి 27,210 క్యూసెక్కుల నీటి వరద వస్తోంది. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 41.2 టీఎంసీల నీటి నిల్వ ఉంది. వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు విడుదల చేస్తున్నారు. జోగులాంబ జిల్లా గద్వాల నియోజకవర్గం ధరూర్ మండల పరిధిలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు కుడికాలువకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి బుధవారం నీరు విడుదల చేశారు. వనపర్తి జిల్లా మదనాపురంలోని రామన్పాడ్ రిజర్వాయర్ ప్రధాన ఎడమ కాలువ ద్వారా, రాజీవ్ భీమాపేజ్-2 నుంచి నీటిని ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, తూడి మేఘారెడ్డి తదితరులు దిగువకు విడుదల చేశారు.

# తెలంగాణ పోలీస్ శాఖలో భారీగా నియామకాలు

**మొదటిపేజీ తరువాయి**

1,052 పోస్టులు భర్తీ చేయనున్నారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఎస్సై 44, కానిస్టేబుల్ 1,380 పోస్టులున్నాయి. ఫైర్ విభాగంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ 39, ఫైర్ రైటర్ 751 పోస్టులు భర్తీ చేయనున్నారు. జైళ్ల శాఖలో 223 పోస్టులు భర్తీ చేయనున్నట్లు పోలీసు నియామక మండలి తెలిపింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని.. దానికి సంబంధించిన తేదీలను త్వరలో వెల్లడిస్తామని పేర్కొంది. పూర్తి వివరాలకు అధికారిక వెబ్‌సైట్ ను సందర్శించాలని సూచించింది. దరఖాస్తు చేసుకునే ముందే నోటిఫికేషన్‌లో పేర్కొన్న దేహదారుఢ్య, వైద్య ప్రమాణాలకు తాము తగినట్లుగా ఉన్నామో లేదో తెలుసుకోవడానికి సివిల్ సర్జన్‌తో పరీక్షించుకోవాలని అభ్యర్థులకు సూచించారు. ఆన్‌లైన్ అప్లికేషన్ దాఖలు చేయడానికి తెలంగాణ ఎస్సీ కేటగిరీ అభ్యర్థులు తమ ఉపకుల వర్గీకరణ స్పష్టంగా ఉండేలా కుల ధృవీకరణ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ చైర్మన్ తెలిపారు. దరఖాస్తుల పక్రియకు సంబంధించి తేదీలను త్వరలో ప్రకటించనున్నట్లు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

# తెలంగాణ ప్రాజెక్టులకు భారీ ఊరట

**మొదటిపేజీ తరువాయి**

మాత్రమే వర్తిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. దీంతో తెలంగాణలో కొనసాగుతున్న ఈ కీలక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎలాంటి చట్టపరమైన ఆటంకం ఉండదని స్పష్టత వచ్చింది. అదే సమయంలో భవిష్యత్తులో చేపట్టే కొత్త ప్రాజెక్టులకు ముందస్తు పర్యావరణ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని న్యాయస్థానం పేర్కొంది. కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా చట్టాలను భర్తీ చేయడం సాధ్యంకాదని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. అత్యవసర పరిస్థితుల్లో మినహాయింపులు ఇవ్వాలంటే కేంద్రప్రభుత్వం చట్టబద్ధమైన నోటిఫికేషన్ జారీ చేయాల్సిందేనని సూచించింది. ఇప్పటికే పూర్తయిన లేదా నిర్మాణంలో ఉన్న కీలక ప్రాజెక్ట్ పనులకు ఎలాంటి అంతరాయం ఉండదని న్యాయస్థానం పేర్కొనడంతో తెలంగాణ ప్రభుత్వం, సాగునీటి ప్రాజెక్టులకు ఇది కీలక ఊరటనిచ్చిన తీర్పుగా భావిస్తున్నారు.

# సర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనండి

**మొదటిపేజీ తరువాయి**

అభినందించారు. ఏఐసీసీ కార్యాలయంలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సర్‌పై రివ్యూ చేశామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. 36 వేల మంది బీఎల్ఏలను నియమించినట్లు చెప్పారు. 50-60 శాతం ఈ పక్రియ పూర్తయిందని వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో 100 శాతం పూర్తవుతుందని వివరించారు. అర్హతగల ఓటర్ల ఓటు హక్కు కాపాడటం తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈసారి ÷ూఎఖీ పక్రియ దురుద్దేశంతో జరుగుతుందని చెప్పారు. ఓట్లను కాపాడే ఉద్దేశంతో ఈ సమావేశంలో చర్చించామని తెలిపారు. సంస్థాగత బలోపేతం, పార్టీ ప్రభుత్వ సమన్వయంపై మాట్లాడామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాగా, ఢిల్లీ ఇందిరా భవన్‌లో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , సీతక్క , సీడబ్ల్యూసీ సభ్యులు మంత్రి దామోదర్ రాజానర్సింహ, వంశీచంద్ పాల్గొన్నారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. తెలంగాణలో ఎస్ఐఆర్ పక్రియ, పార్టీ - ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా చర్చించారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ కమిటీ పనితీరు, ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ కార్యక్రమాల సమన్వయం, ప్రజలకు చేరువ చేసే కార్యాచరణపై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, సంస్థాగత బలోపేతం, రాజకీయ పరిస్థితులపై కూడా సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

# అత్యుత్తమ డిజిటల్ పౌరసేవల వేదికగా మీ-సేవ

**మొదటిపేజీ తరువాయి**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బుధవారం మీ-సేవ విభాగం పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో శాఖ అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు, ఈ-గవర్నెన్స్ ప్రాజెక్టులు, డిజిటల్ సేవల పురోగతిని సిఎస్ సమీక్షించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆగస్టు 15 నాటికి మీ-సేవ ద్వారా అందించే సేవల పరిధిని మరింత విస్తరించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం 33 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అనేక సేవలు మీ-సేవ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్నాయని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవలను ఈ వేదికలో చేర్చేందుకు కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ప్రస్తుత ఆధునిక సమాచార సాంకేతికత, కృత్రిమ మేధస్సు డేటా ఆధారిత పరిష్కారాలను మీ-సేవ వ్యవస్థతో అనుసంధానించి, ఈ-గవర్నెన్స్ సేవలను ప్రజల ముంగిటకు మరింత సమర్ధవంతంగా తీసుకెళ్లే విధంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. పౌరులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వీలైనన్ని ఎక్కువ సేవలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన, సమయానుకూలమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ప్రధాన కార్యదర్శి, మీ-సేవను దేశంలోనే ఆదర్శవంతమైన పౌర సేవల వేదికగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దూరిశెట్టి, మీ-సేవ డైరెక్టర్ రవికిరణ్‌తో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్రలో ఏనుగుల దాడులకు చెక్..

**మొదటిపేజీ తరువాయి**

ఈ శిబిరం ఏర్పాటు ఉత్తరాంధ్రలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని ఆయన అభివర్ణించారు.

సీతానగరం మండలం గుచ్చిమి గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని పవన్ కల్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, “ప్రకృతి మనది కాదు, మనమే ప్రకృతిలో భాగం. కాబట్టి దానితో సామరస్యంగా జీవించాలి. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత ఉన్నప్పుడే సుస్థిర ప్రగతి సాధ్యమవుతుంది“ అని అన్నారు.పార్వతీపురం మన్యం జిల్లాలో అడవుల నుంచి ఏనుగులు గ్రామాల్లోకి రావడం, రైతుల పంటలను నాశనం చేయడం, రాత్రిపూట ప్రజలు భయంతో జీవించడం వంటి సమస్యలు చాలాకాలంగా ఉన్నాయని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం అందించాలనే లక్ష్యంతోనే ‘గుచ్చిమి ఎలిఫెంట్ హోల్డింగ్ ఏరియా‘ను ఏర్పాటు చేశామని వివరించారు. గతంలో చిత్తూరు జిల్లా పలమనేరు ప్రాంతంలో ‘జయంత్’, ‘అభిమన్యు‘ అనే కుంకీ ఏనుగులు అటవీ శాఖ అధికారులతో కలిసి అద్భుతంగా పనిచేశాయని తెలిపారు. ఆధునిక టెక్నాలజీ సాయంతో అక్కడ ఏనుగుల దాడుల్లో మరణాలను 70 శాతానికి పైగా తగ్గించామని, పంట నష్టాన్ని కూడా గణనీయంగా నివారించామని పేర్కొన్నారు. మన్యం జిల్లాలోనూ అలాంటి విజయాన్నే సాధించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ శిబిరం కోసం నాలుగు కుంకీ ఏనుగులను పంపిన కర్ణాటక ప్రభుత్వానికి, ప్రజలకు పవన్ కల్యాణ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. “ఏనుగులను బహుమతిగా ఇవ్వడాన్ని అక్కడి ప్రజలు తమ సంపదను పంచుకోవడంతో సమానంగా భావిస్తారు. ఇది వారి ఉదారతకు, స్నేహానికి నిదర్శనం. తెలుగు ప్రజల భద్రతపై ప్రేమతో ఏనుగులను పంపినందుకు వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు“ అని ఆయన అన్నారు. మానవులు, ఏనుగులు సామరస్యంగా సహజీవనం చేసేందుకు ఈ శిబిరం వేదికగా నిలుస్తుందని ఆశిస్తూ, దీనిని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు.

# దేవాదాయ శాఖలో మరోసారి పదోన్నతుల పండుగ

**మొదటిపేజీ తరువాయి**

వేదికగా జరిగిన ఉద్యోగుల పదోన్నతుల కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీరిలో 48 మంది ఉద్యోగులు గ్రేడ్ 3 ఈవోలుగా, ఇద్దరు గ్రేడ్ 2 ఈవోలుగా, ఒకరు గ్రేడ్ 1 ఈవోలుగా మంత్రి సురేఖ గారి చేతులు మీదుగా పదోన్నతుల ఉత్తర్వులను అందుకున్నారు. వీరితో పాటు అర్చక సంక్షేమ నిధి ద్వారా అర్హులైన 15 మంది అర్చకులకు (వారి కటుంబ సభ్యులు) పదవీ విరమణ, మరణ గ్రాట్యుటీ, వివాహ రుణం మంజూరు ఉత్వర్వులను మంత్రి సురేఖ గారు అందించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ డైరక్టర్ హనుమంతరావు, రాష్ట్ర దేవాలయ పాలనా సంస్థ డైరక్టర్ చిలకపాటి విజయ రాఘవాచార్యులు, ఆర్‌జెసి రామకృష్ణారావు, డిప్యూటి కమిషనర్ వినోద్ రెడ్డి, అడిషనల్ కమిషనర్లు జ్యోతి, శ్రీనివాస్, ఈవోల సంఘం అధ్యక్షుడు నరేందర్, టెంపుల్ ఎంఎ÷-లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగారెడ్డి, తెలంగాణ దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగ జాక్ కన్వీనర్ డి.వి.ఆర్.శర్మ, పలువురు దేవాదాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇవాళ గ్రేడ్ 3 ఈవోలుగా పదోన్నతులు అందుకున్నవారితో కలిపి, గతంలో గ్రేడ్ 1, గ్రేడ్ 2 కేటగిరీల్లోనూ పదోన్నతులు ఇవ్వడం ద్వారా మొత్తం 168 మంది ఉద్యోగులకు కార్యనిర్వహణాధికారులుగా పదోన్నతి కల్పించి, ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. సరిగ్గా పది రోజుల క్రితం రవీంద్రభారతి వేదికగా వేదపండితులు, అర్చకులు, పరిచారకులు, డోలు, సన్నాయి కళాకారులు తదితర 191 ధార్మిక నియామక ఉత్తర్వులు అందజేసిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనమని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. అర్చక సంక్షేమ నిధి కింద పదవీ విరమణ, మరణ గ్రాట్యుటీని రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంచడంతో పాటు అంత్యక్రియల సహాయాన్ని రూ.20 వేల నుంచి రూ.30 వేలకు పెంచి అర్చక కుటుంబాలకు మరింత భరోసా కల్పించామని మంత్రి తెలిపారు. సరస్వతి నది ఆది, అంత్య పుష్కరాలను విజయవంతంగా నిర్వహించామని, గోదావరి పుష్కరాలు (2027), కృష్ణ పుష్కరాలు (2028) కోసం ఇప్పటికే ప్రణాళికాబద్ధంగా కార్యాచరణను అమలు చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు పుష్కరాలు అంటే తెలంగాణ అనే స్థాయిలో రానున్న పుష్కరాలు చేపడతామని మంత్రి సురేఖ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దేవాదాయ శాఖలో సంస్కరణల యుగానికి శ్రీకారం చుట్టామని, నియామకాలు, పదోన్నతులు, ఉద్యోగుల సంక్షేమం, భక్తులకు మెరుగైన సేవలు, ఆలయాల అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నట్లు మంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో దేవాదాయశాఖ ప్రతిష్టను మరింత ఇనుమడింపచేస్తూ, దేవాదాయశాఖను మరో స్థాయిలో నిలబెట్టేలా కార్యక్రమాలు చేపడతామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. దశాబ్దాల నిరీక్షణకు తెరపడడంతో ఈవోలుగా పదోన్నతులు అందుకున్న ఉద్యోగులు భావోద్వేగానికి లోనయ్యారు. తమ ఉద్యోగ జీవితంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన గుర్తింపు లభించడంతో వారంతా మంత్రి కొండా సురేఖకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# తాటికాయల వాగులో ఇసుక దందా..

**నెల రోజులుగా యథేచ్ఛగా తవ్వకాలంటున్న గ్రామస్తులు**

**ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని ఆందోళన -ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని డిమాండ్**




**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, జూలై 29 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని తాటికాయల గ్రామ వాగులో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే వాగు నుంచి ఇసుకను తవ్వి ట్రాక్టర్ల ద్వారా విక్రయిస్తున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు స్పందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామస్తుల కథనం ప్రకారం, గత నెల రోజులుగా పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుక దందా కొనసాగుతున్నా రెవెన్యూ, పోలీసు, గనుల శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శిస్తున్నారు. గ్రామస్తులకు స్పష్టంగా కనిపిస్తున్న అక్రమాలు అధికారుల దృష్టికి ఎలా వెళ్లడం లేదని ప్రశ్నిస్తున్నారు.అక్రమ ఇసుక తవ్వకాల వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని, వాగు సహజ స్వరూపం దెబ్బతింటోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన ఓ జేసీబీ యజమాని ఈ అక్రమ ఇసుక దందాకు పాల్పడుతున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా, ఇసుక డంపు ప్రాంతానికి వెళ్లి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించిన వారిని బెదిరింపులకు గురిచేస్తున్నట్లు కూడా గ్రామస్తులు చెబుతున్నారు.ఈ ఆరోపణలపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించాలని, అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలపై రెవెన్యూ, పోలీసు, గనుల శాఖ అధికారులు స్పందించాల్సి ఉంది.

# గురు పౌర్ణమి వేళ పచ్చదనానికి శ్రీకారం

**రాళ్లవాగు తండాలో ఇంటింటికీ మొక్కల పంపిణీ**

**మొక్కలను పెంచితేనే భావితరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్: సర్పంచ్ శంకర్ నాయక్**




**దామరచర్ల/ జూలై 29 (జర్నలిస్ట్ వార్త):** గురు పౌర్ణమి సందర్భంగా దామరచర్ల మండలంలోని రాళ్లవాగు తండా గ్రామంలో "వృక్షో రక్షతి రక్షితః" అనే నినాదంతో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ దిరావత్ శంకర్ నాయక్ ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేసి గ్రామస్థులను పచ్చదనం పెంపొందించేందుకు ప్రోత్సహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ శంకర్ నాయక్ మాట్లాడుతూ, మొక్కలను నాటి సంరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. మొక్కలు పెంచడం వల్ల స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం లభించడంతో పాటు భావితరాలకు మంచి భవిష్యత్తు అందించవచ్చని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్, ఆశా వర్కర్, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొని మొక్కల సంరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.

# కల్లూరుకు అన్యాయం వద్దు..!

**డివిజన్‌కు మంజూరైన కార్యాలయాలను తరలించొద్దు**

**ఆర్డీవో, సబ్ ట్రెజరీ, అగ్నిమాపక కేంద్రాన్ని కల్లూరులోనే ఏర్పాటు చేయాలి**

**ప్రభుత్వానికి ప్రజల విజ్ఞప్తి**




**కల్లూరు/జులై29 (జర్నలిస్ట్ వార్త)**కల్లూరు రెవెన్యూ డివిజన్‌కు మంజూరైన ప్రభుత్వ కార్యాలయాలను ఇతర ప్రాంతాలకు తరలించకుండా కల్లూరు పట్టణంలోనే కొనసాగించాలని స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. డివిజన్ ఏర్పాటు సమయంలో ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ సేవలు అందించాలనే ఉద్దేశంతో మంజూరైన కార్యాలయాలను ఇప్పుడు ఇతర ప్రాంతాలకు తరలించే యత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోందని పేర్కొంటున్నారు.డివిజన్‌కు మంజూరైన ఆర్డీవో కార్యాలయం, సబ్ ట్రెజరీ, అగ్నిమాపక కేంద్రం తదితర ఉప కార్యాలయాలను కల్లూరు మండల పరిధిలోనే ఏర్పాటు చేసి వెంటనే ప్రారంభించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యాలయాలు కల్లూరులోనే ఉంటే పరిధిలోని ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా అందుతాయని, పరిపాలనా వికేంద్రీకరణ లక్ష్యం నెరవేరుతుందని అభిప్రాయపడుతున్నారు.డివిజన్ కేంద్రానికి సంబంధించిన కార్యాలయాలను ఇతర ప్రాంతాలకు తరలించడం వల్ల వేలాది మంది ప్రజలు అనవసరంగా దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ డివిజన్‌కు మంజూరైన అన్ని కార్యాలయాలను కల్లూరులోనే ఏర్పాటు చేసి వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

# జలసిరితో జల భద్రతే లక్ష్యం

**ప్రతి ఇంటా ఇంకుడు గుంత.. ప్రతి పొలంలో పంటకుంట ఏర్పాటు చేయాలి: సర్పంచ్ బిల్లా యాదగిరి**





**వేలేరు/ జూలై 29 (జర్నలిస్ట్ వార్త):** ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గుతున్న నేపథ్యంలో వర్షపు నీటి ప్రతి చుక్కను ఒడిసిపట్టి భూగర్భ జలాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జలసిరి కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆయన అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశానికి తహసీల్దార్ (ఎంఆర్ఓ) శ్రీమతి కోమి, ఎంపీడీవో కిషన్ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ.. వర్షపు నీటిని వృథా కాకుండా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు, ప్రతి రైతు పొలంలో పంటకుంటలు ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించవచ్చన్నారు. ఇంకుడు గుంత నిర్మాణానికి గ్రామపంచాయతీ ద్వారా రూ.6,500 ప్రోత్సాహకం అందజేస్తుండగా, పంటకుంటలను ఉచితంగా ఏర్పాటు చేసి ఉచిత చేప పిల్లలను కూడా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి గ్రామస్తుడు, ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అనంతరం తహసీల్దార్ శ్రీమతి కోమి, ఎంపీడీవో కిషన్ నాయక్ మాట్లాడుతూ జలసిరి కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని, వర్షపు నీటి సంరక్షణ ద్వారానే భవిష్యత్ తరాలకు నీటి భద్రత సాధ్యమవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల ఎంపీవో బుచ్చిరెడ్డి, ఉపసర్పంచ్ శ్రీకర్, గ్రామపంచాయతీ కార్యదర్శి విజయ, ఎస్‌బీఐ మేనేజర్ బిక్షపతి, హెల్త్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఆర్ఐఓ సురేందర్, వ్యవసాయ శాఖ అధికారి రాజశేఖర్, ఐకేపీ సీసీ రమాదేవి, విద్యాశాఖ ప్రతినిధి లీలాబాయి, నీటిపారుదల, విద్యుత్ శాఖల అధికారులు, వార్డు సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

**గాంధీభవన్‌లో ప్రజలతో ముఖాముఖి నిర్వహించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**ఖమ్మం/ జూలై 29 (జర్నలిస్ట్ వార్త):** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపడమే ఇందిరమ్మ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయం (గాంధీభవన్)లో బుధవారం నిర్వహించిన 'ప్రజలతో ముఖాముఖి' కార్యక్రమంలో ఆయన పాల్గొని రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రజలు, రైతులు, బాధితుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గాంధీభవన్‌లో ప్రతిరోజూ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడం ద్వారా క్షేత్రస్థాయి సమస్యలు నేరుగా ప్రభుత్వ దృష్టికి వస్తున్నాయని తెలిపారు. వ్యవసాయం, రెవెన్యూ, పింఛన్లు, భూ వివాదాలు, ఇతర వ్యక్తిగత, సామాజిక సమస్యలకు సంబంధించిన వినతులను సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు పంపించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు వెల్లడించారు.ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పలువురు ముఖ్య నేతలు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పులులుంటేనే అడవులకు జీవం

**తల్లాడలో ఘనంగా అంతర్జాతీయ పులుల దినోత్సవం -అటవీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ.. విద్యార్థులకు పోటీలు**






**తల్లాడ/జూలై 29 (జర్నలిస్ట్ వార్త):** పులుల సంరక్షణతోనే అడవుల మనుగడ సాధ్యమని, వన్యప్రాణుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తల్లాడ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జి. ఉమా అన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం తల్లాడ అటవీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.తల్లాడ ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం నుంచి బస్టాండ్ మీదుగా నిర్వహించిన అవగాహన ర్యాలీలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా పులుల సంరక్షణ, అడవుల పరిరక్షణ, వన్యప్రాణుల రక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు.అనంతరం తల్లాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జి. ఉమా మాట్లాడుతూ పులులు అడవుల ఆరోగ్యానికి సూచికలని, అడవులు పర్యావరణ సమతుల్యతకు జీవనాధారమని పేర్కొన్నారు. వన్యప్రాణులను సంరక్షించడం ద్వారా భావితరాలకు సురక్షితమైన పర్యావరణాన్ని అందించవచ్చని విద్యార్థులకు వివరించారు.పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి. బాలాజీ, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు ఆర్. కవిత, పి. కిషోర్ కుమార్, వి. స్వాతి, లావణ్య, సమత, అరుణ, శ్రీకాంత్, భీమా, హరికృష్ణ, ఆజాం అలీ, వీరభద్రం, ఎస్.కె. పాషా, నాగరాజు తదితర అటవీ శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.ర్యాలీ ముగింపులో "పులులను కాపాడుదాం.. అడవులను రక్షిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే నినాదాలతో ప్రజల్లో చైతన్యం కల్పించారు.

# చావైనా... పెళ్లైనా... డప్పు దరువే!

**తల్లి అంతిమయాత్రలో డప్పుల దరువు.. జానపద కళతో భావోద్వేగ నివాళి**

**దామెరలో ఆకట్టుకున్న సంప్రదాయ అంత్యక్రియలు**



**ఎల్కతుర్తి/జూలై 29(జర్నలిస్ట్ వార్త)** చావైనా... పెళ్లైనా... డప్పు దరువే తమ జీవితమని మరోసారి నిరూపించారు జానపద కళాకారులు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో సొసైటీ బ్యాంకు డైరెక్టర్ మంతుర్తి సమ్మయ్య యాదవ్ తల్లి మంతుర్తి ఐలమ్మ మృతి చెందగా, ఆమె అంతిమయాత్రలో సంప్రదాయ డప్పుల దరువులు, నృత్యాలతో కళాకారులు ఘనంగా వీడ్కోలు పలికారు. విషాద వాతావరణంలోనూ సంప్రదాయాన్ని కాపాడుతూ కళాకారులు ప్రదర్శించిన డప్పు విన్యాసాలు గ్రామస్థులను కట్టివడేశాయి. అంతిమయాత్ర సాగుతున్నంతసేపూ డప్పుల మోతతో కళాకారులు అడుగులు వేస్తూ ఐలమ్మకు తుది నివాళి అర్పించారు. జీవితం మొత్తం జానపద కళలకు అంకితమైన కుటుంబానికి ఇదే సరైన వీడ్కోలు అంటూ పలువురు గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు.గ్రామస్థుల కథనం ప్రకారం మంతుర్తి సమ్మయ్య యాదవ్‌కు జానపద కళలపై చిన్నప్పటి నుంచే మక్కువ ఉంది. కుర్మ డోలు వాయించడంలో దిట్టగా పేరుగాంచిన ఆయన, మాదిగల సంప్రదాయ డప్పు వాయించడంలోనూ సమాన నైపుణ్యం సంపాదించారని తెలిపారు. కులాలకు అతీతంగా కళను గౌరవిస్తూ అన్ని వర్గాల కళాకారులతో కలిసి ప్రదర్శనలు ఇవ్వడం ఆయన ప్రత్యేకతగా పేర్కొన్నారు.నేటి తరంలో కనుమరుగవుతున్న జానపద కళలను ఇలాంటి సందర్భాల ద్వారా సజీవంగా ఉంచుతున్న కళాకారులను గ్రామస్థులు అభినందించారు. దామెర గ్రామంలో జరిగిన ఈ అంతిమయాత్ర సంప్రదాయం, సంస్కృతి, కళల సమ్మేళనంగా నిలిచి పలువురిని భావోద్వేగానికి గురి చేసింది.

# అండగా స్త్రీ శక్తి సదన్

## ఒంటరి మహిళల కోసం షెల్టర్ హోమ్ ప్రారంభం






**సత్తుపల్లి/జూలై 29 (జర్నలిస్ట్ వార్త):** సమాజంలో నిరాశ్రయ, ఒంటరి మహిళలకు అండగా నిలిచే ఓడబ్ల్యుఎంఈఎన్ షెల్టర్ హోమ్‌స్త్రీ శక్తి సదన్ గ్రామ వికాస్ వసతి గృహాన్ని సత్తుపల్లి మున్సిపాలిటీలోని మసీద్ రోడ్డులో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ బుధవారం ప్రారంభించారు. జీవనాధారం లేని మహిళలు, మానసిక ఇబ్బందులతో బాధపడుతున్న వారు, దివ్యాంగులు తదితర అవసరమైన వారికి ఈ కేంద్రంలో ఆశ్రయం కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భార్యాభర్తల మధ్య తలెత్తే కుటుంబ విభేదాల పరిష్కారానికి ప్రత్యేక కౌన్సెలింగ్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో అవసరమని ఎమ్మెల్యే రాగమయి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా బేగం, వైస్ చైర్‌పర్సన్ బొంతు సుమలత, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, కౌన్సిలర్లు గ్రాండ్ మౌలాలి, తోట సుజలారాణి, షెల్టర్ హోమ్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, వ్యవస్థాపకుడు సూర్యనారాయణ, రూరల్ సీఐ, ఏఎస్ఐ, కార్యదర్శులు అనురాధ, ప్రభావతి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, సీనియర్ నాయకుడు చల్లగుళ్ల నరసింహారావు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# మా రోడ్లను కాపాడే నాథుడే లేడా..!

**వేల కోట్లు బురదలో పోసిన పన్నీరేనా?**

**సీసీ రోడ్లపై ట్రాక్టర్ల రాకపోకలతో పగుళ్లు..**

**అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం**

**నర్సంపేట/జూలై 29 (జర్నలిస్ట్ వార్త):**

వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్ పరిధిలోని చెన్నారావుపేట మండలం తిమ్మరాయని పహాడ్ గ్రామంలో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్లు ట్రాక్టర్ల రాకపోకలతో దెబ్బతింటున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాలకు వెళ్లే ట్రాక్టర్లు డ్రిల్లులు, వ్యవసాయ పనిముట్లతో నేరుగా సీసీ రోడ్లపై ప్రయాణిస్తుండటంతో కొత్తగా వేసిన రోడ్లు పగుళ్లు ఏర్పడి, పెచ్చులు లేస్తున్నాయని తెలిపారు.

ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపించారు. ట్రాక్టర్లు సీసీ రోడ్లపై వెళ్తున్న దృశ్యాలను ఫొటోలు తీసి అధికారులకు పంపించినా స్పందన లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరింత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే గ్రామ సర్పంచ్‌కు కూడా ట్రాక్టర్ ఉండటంతో, అధికారుల కనుసన్నల్లోనే ఈ వ్యవహారం సాగుతోందనే అనుమానాలను గ్రామస్థులు వ్యక్తం



చేస్తున్నారు. ప్రజల సొమ్ముతో నిర్మించిన సీసీ రోడ్లు కొద్ది రోజుల్లోనే దెబ్బతింటుండగా సంబంధిత అధికారులు మౌనం వీడకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీ



రోడ్లపై భారీ వాహనాల రాకపోకలను నియంత్రించి, దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టి గ్రామ ఆస్తులను కాపాడాలని తిమ్మరాయని పహాడ్ గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

# హైడ్రా కమిషనర్‌గా ఏవీ రంగనాథ్‌ను కొనసాగించాలి

**భూ కబ్జాలపై ఉక్కుపాదం మోపిన అధికారికి కొనసాగింపు ఇవ్వాలని డిమాండ్**

**సామాజిక ఉద్యమకారుడు రేణుకుంట్ల దుర్గాప్రసాద్ మాదిగ**

**హసన్‌పర్తి/జూలై 29 (జర్నలిస్ట్ వార్త):**

రాష్ట్రంలో ప్రభుత్వ భూములు, చెరువులు, పార్కులు, రహదారులను భూ కబ్జాదారుల నుంచి రక్షించడంలో కీలక పాత్ర పోషించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను అదే పదవిలో కొనసాగించాలని సామాజిక ఉద్యమకారుడు రేణుకుంట్ల దుర్గాప్రసాద్ మాదిగ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హసన్‌పర్తి మండలం 65వ డివిజన్ ఎల్లాపూర్ అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం భూ ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటూ హైడ్రాను ఏర్పాటు చేయడం రాష్ట్రంలో సంచలన నిర్ణయమని పేర్కొన్నారు. చెరువులు, ప్రభుత్వ భూములు, పార్కులు, నాళాలు,



ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురికాకుండా హైడ్రా సమర్థంగా పనిచేసిందన్నారు. హైడ్రా ఆధ్వర్యంలో బతుకమ్మకుంట సహా పలు చెరువులను ఆక్రమణల నుంచి విముక్తం చేసి, ఎఫ్‌టీఎల్ పరిధిని గుర్తించడం, లోతట్టు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను రక్షించడం, పేదల నివాస స్థలాలను భూమి మాఫియా నుంచి కాపాడడంలో ఏవీ రంగనాథ్ విశేష కృషి చేశారని కొనియాడారు. గత రెండేళ్లలో 1,604 ఎకరాల ప్రభుత్వ భూములు, 296 ఎకరాల సరస్సులు, 90 ఎకరాల పార్కులు, 49 ఎకరాల రోడ్లుఫుట్‌పాత్‌లు, 19 ఎకరాల నాళాలు, 39 ఎకరాల లేఅవుట్ ఓపెన్ స్పేస్‌లు తదితర ప్రభుత్వ ఆస్తులను ఆక్రమణల నుంచి రక్షించారని తెలిపారు. దీంతో భూ కబ్జాదారుల్లో భయం నెలకొని, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు బలమైన వ్యవస్థ ఏర్పడిందన్నారు. హైడ్రా వ్యవస్థను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడంతో పాటు ఏవీ రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్‌గా కొనసాగిస్తేనే ప్రభుత్వ ఆస్తులు సురక్షితంగా ఉంటాయని, భూమి మాఫియా నుంచి ప్రజలను కాపాడేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 65వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నేదునూరి సునీల్, కల్వచర్ల సుదర్శన్, గంగిళ్ల వెంకట్‌రెడ్డి, బొద్దిరెడ్డి అనంతరెడ్డి, మోతె మధుసూదన్ రెడ్డి, గోపనబోయిన సతీష్, దోమల అశోక్, మద్దెల కుమారస్వామి, గోపరాజు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఖో-ఖోలో ఏకశిలకు స్వర్ణ విజయం

**సీబీఎస్ఈ క్లస్టర్7లో ఛాంపియన్.. జాతీయ స్థాయికి తెలంగాణ ఏకైక జట్టు**




**ఐనవోలు, జులై 29 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణఆంధ్రప్రదేశ్ సీబీఎస్ఈ క్లస్టర్7 ఖో-ఖో ఛాంపియన్‌షిప్‌లో పున్నేలుకు చెందిన ఏకశిల హైస్కూల్ బాలికల జట్టు ప్రథమ స్థానం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. ఈ విజయంతో తెలంగాణ నుంచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన ఏకైక జట్టుగా గుర్తింపు పొందింది. విజేతలకు ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతి రెడ్డి షీల్డులు అందజేసి అభినందించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించేలా అన్ని వసతులు కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. జట్టు విజయానికి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.డి. బాబా, వైస్ ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం. నర్సయ్య, నరేష్, రవీందర్, రజినీకర్, సుభాష్, రాజేష్, రజిత, రేణుకతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జమ్మూకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఖమ్మంలో ఘన స్వాగతం

**పోలీస్ గౌరవ వందనం..**

**జిల్లా అభివృద్ధిపై అధికారులతో సమీక్ష**

**ఎన్ఎస్‌పీ అతిథి గృహంలో కలెక్టర్ దివాకర టీఎస్ పుష్పగుచ్ఛంతో ఆహ్వానం**

**వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర వివరాలు.. అనంతరం హైదరాబాద్‌కు ప్రయాణం**

**ఖమ్మం/జూలై 29 (జర్నలిస్ట్ వార్త):** జమ్మూకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనకు విచ్చేశారు. ఎన్ఎస్‌పీ అతిథి గృహానికి చేరుకున్న ఆయనకు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లెఫ్టినెంట్ గవర్నర్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్‌తో పాటు పలువురు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు



మర్యాదపూర్వకంగా లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలిశారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ దివాకర టీఎస్ ఖమ్మం జిల్లా సమగ్ర అభివృద్ధిపై ప్రజెంటేషన్ ఇచ్చారు. జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, వ్యవసాయాభివృద్ధి, పారిశ్రామిక పురోగతి, సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల విస్తరణ, గ్రామీణపట్టణాభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహం తదితర అంశాలను వివరించారు. జిల్లా భౌగోళిక స్వరూపం, సహజ వనరులు, సాంస్కృతిక వారసత్వం, ప్రభుత్వ



ప్రాధాన్య కార్యక్రమాల అమలు, ప్రజలకు అందుతున్న సేవలపై కూడా కలెక్టర్ వివరించారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ఖమ్మం ప్రజల ఆతిథ్యానికి అభినందనలు తెలియజేసి అనంతరం హైదరాబాద్‌కు బయలుదేరారు. కార్యక్రమంలో జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**వాహనదారులు, ప్రజలు జాగ్రత్తలు పాటిస్తేనే ప్రమాదాలు నివారించవచ్చు**

**వర్ధన్నపేట ఎస్సై సాయిబాబు**

**వర్ధన్నపేట/జూలై 29 (జర్నలిస్ట్ వార్త):**




రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితులు మినహా బయటకు రావడాన్ని తగ్గించాలని వర్ధన్నపేట ఎస్సై సాయిబాబు సూచించారు. తెలంగాణ పోలీసు శాఖ జారీ చేసిన వర్షాకాల భద్రతా సూచనలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు. వర్షం కురుస్తున్న సమయంలో అవసరం లేకుండా బయటకు వెళ్లవద్దని, ముఖ్యంగా వాహనదారులు వేగంగా వెళ్లకుండా రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో అత్యంత జాగ్రత్తగా ప్రయాణించాలని సూచించారు. కాలువలు, చెరువులు, వాగుల సమీపాలకు వెళ్లకూడదని, విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలు కనిపిస్తే వాటికి దూరంగా ఉండి వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. చెట్లు, బలహీనమైన గోడలు, పాత భవనాల వద్ద నిలబడకూడదని, భారీ గాలులు, ఉరుములు, మెరుపులు ఉన్న సమయంలో సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ ధరించడం మర్చిపోవద్దని తెలిపారు. వర్షాల సమయంలో ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే వెంటనే పోలీసు శాఖ, విద్యుత్ శాఖ లేదా ఇతర అత్యవసర సేవలకు సమాచారం అందించాలని ఎస్సై సాయిబాబు విజ్ఞప్తి చేశారు. ప్రజల అప్రమత్తతే ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించగలదని, నెమ్మదిగా నడవండి. సురక్షితంగా ఇంటికి చేరుకోండి అనే తెలంగాణ పోలీసు సందేశాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు.

# కరెంట్ స్తంభమే కాటేసింది

**విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి మూడు మూగజీవాలు బలిద -కరెంట్ లీకేజీతో అక్కడికక్కడే గొర్రెల మృతి**

**ముందే ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు -రూ.60 వేల నష్టం.. పరిహారం ఇవ్వకుంటే సబ్‌స్టేషన్ ముట్టడిస్తామని బాధితుడి హెచ్చరిక**


**ఎల్కతుర్తి/జూలై 29 (జర్నలిస్ట్ వార్త):**

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం మూడు మూగజీవాల ప్రాణాలను బలిగొంది. ప్రమాదకరంగా మారిన ఇనుప విద్యుత్ స్తంభానికి కరెంట్ లీకేజీ ఉన్నప్పటికీ దానిని మరమ్మతు చేయకపోవడంతో మూడు గొర్రెలు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందిన ఘటన ఎల్కతుర్తి మండలంలోని చింతలపల్లి గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. ఈ ఘటనతో గ్రామస్థులు విద్యుత్ శాఖ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దామెర గ్రామానికి చెందిన రొడ్డ భిక్షపతి తన గొర్రెల మందను ఇంద్రానగర్ నుంచి దామెరకు తోలుకెళ్తుండగా బాండ్లకుంట చెరువు సమీపంలోని మర్రిచెట్టు వద్ద ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాన్ని మూడు గొర్రెలు తాకాయి. స్తంభంలో విద్యుత్ ప్రవహిస్తుండటంతో అవి ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందాయి. మృతిచెందిన గొర్రెల విలువ సుమారు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు. గ్రామస్థుల కథనం ప్రకారం, ఈ ఇనుప విద్యుత్ స్తంభంలో కరెంట్ లీకేజీ సమస్య చాలాకాలంగా ఉంది. పలుమార్లు సంబంధిత లైన్‌మెన్, ఏఈ సహా విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా



వారు పట్టించుకోలేదని ఆరోపించారు. సమస్యను సకాలంలో పరిష్కరించి ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ ప్రాంతాల్లో ప్రమాదకరంగా మారిన ఇనుప విద్యుత్ స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాల్సిన నిబంధనలు ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు విమర్శించారు. ఏఈ, డీఈ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయకపోవడంతో ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని పేర్కొన్నారు.

మృతిచెందిన గొర్రెలకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని, ప్రమాదకరంగా ఉన్న ఇనుప విద్యుత్



స్తంభాలను వెంటనే తొలగించి సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని బాధితుడు రొడ్డ భిక్షపతి డిమాండ్ చేశారు. లేదంటే గ్రామస్థులతో కలిసి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాల భద్రతపై అధికారులు వెంటనే ప్రత్యేక తనిఖీలు చేపట్టి, కరెంట్ లీకేజీ ఉన్న స్తంభాలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# సట్ల యాదగిరి గౌడ్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

**వర్ధన్నపేట/జూలై 29(జర్నలిస్ట్ వార్త):**



వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు సట్ల యాదగిరి గౌడ్ గుండెపోటుతో మృతి చెందగా, ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు బుధవారం ఆయన నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వెంటా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దు సత్యం, మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ పాలకుర్తి సారంగపాణి, ఐనవోలు టెంపుల్ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కౌడగని రాజేష్ కన్నా, మైనార్టీ రాష్ట్ర నాయకుడు ఎం.డి. చోటే బాయ్, టౌన్ అధ్యక్షుడు ఈగ దామోదర్, గ్రామ అధ్యక్షుడు ఎద్దు రాజేంద్ర ప్రసాద్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హత కలిగిన ఓటరు నమోదు కావాలి.

-ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య.




**బయ్యారం/,జులై 29.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండలం కొత్తపేట పంచాయతీ పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కనకయ్య మాట్లాడుతూ..ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు పునాది వంటిదని, ప్రతి అర్హత కలిగిన వ్యక్తి ఓటరు జాబితాలో తన పేరు నమోదు చేసుకుని ఆ హక్కును పరిరక్షించుకోవాలని అన్నారు.ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయడంలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు పార్టీ నాయకులు,కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సూచించారు.ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, నిరక్షరాస్యులు మరియు స్వయంగా ఫారమ్‌లు నింపలేని వారికి ప్రత్యేక సహకారం అందించి ఎవరూ ఈ ప్రక్రియకు దూరం కాకుండా చూడాలని సూచించారు.అలాగే బూత్ లెవల్ ఏజెంట్లు బూత్ లెవల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఓటరు జాబితాలోని లోపాలను గుర్తించి వాటిని సరిదిద్దేందుకు కృషి చేయాలని తెలిపారు. ప్రతి అర్హత కలిగిన వ్యక్తి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడటం ప్రజాస్వామ్య పరిరక్షణలో ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.ఓటర్లకు ఎలాంటి సందేహాలు, సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు అందుబాటులో ఉండాలన్నారు.కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జూలకంటి సీతారాం రెడ్డి, సర్పంచ్ ప్రవీణ్ నాయక్ గారు ఇల్లందు నియోజకవర్గ ఇంచార్జ్ గిందంకుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావుని శాలువాతో సన్మానించారు.ఈకార్యక్రమంలో బొమ్మకంటి రాంబాబు,నిమ్మగడ్డ శివ,ప్రశాంత్,కారుబోతుల రామ్మూర్తి,చల్లసురేశ్,గూగులోత్ మహేష్,సూరం సుధాకర్ రెడ్డి,ఈసం వెంకటేశ్వర్లు,కేస నిరంజన్,బానోత్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి.

-ఎంపిడివో దీపిక.




**బయ్యారం/,జులై 29.(జర్నలిస్ట్ వార్త)**వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని స్థానిక ఎంపిడివో దీపిక అన్నారు.బుధవారం బయ్యారం మండలంలోని జగ్గుతండ గ్రామ పంచాయతీ సర్పంచ్ బొల్లి జయంతి వెంకట కృష్ణ ఆధ్వర్యంలో బయ్యారం అటవీ ప్రాంతంలో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎంపీడీవో దీపిక ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామస్తులు,విబి–జి రామ్ జి కూలీలతో కలిసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వాతావరణ సమతుల్యాన్ని కాపాడుతూ భావితరాలకు సహజ సిద్ధమైన ప్రాణవాయువును అందించేందుకు వన మహోత్సవం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటలని అన్నారు.ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుంజ వీరస్వామి,ఏపివో సజన్,తమ్మిశెట్టి రామదాసు,వార్డు సభ్యులు వట్టం సావిత్రి,పావని,స్వాతి,కవిత, నాయకులు వాసం రమణయ్య,ఆనంద్, సునీల్,సైదులు,పంజాల వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ ఫామ్‌లు త్వరగా బీఎల్‌వోలకు ఇవ్వాలి.

-తహసీల్దార్ నాగరాజు.



**బయ్యారం/,జులై 29.(జర్నలిస్ట్ వార్త)**
ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పొడిగింపు మళ్లీ ఉండదని బయ్యారం మండల తహసీల్దార్ నాగరాజు స్పష్టం చేశారు.బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఎన్యూమరేషన్ ఫామ్‌లు త్వరగా బీఎల్‌వోలకు ఇవ్వాలని మండలంలోని ఓటర్లకు సూచించారు.ఫామ్ తీసుకున్న ఓటర్లు ఆగస్టు 3వ తేదీ వరకు గడువు ఉందని..కానీ వీటినన్నింటిని డిజిటలైజేషన్ చేయాల్సి ఉందన్నారు.ఈ నేపథ్యంలో సర్ ఫామ్‌లు సాధ్యమైనంత త్వరగా జులై 31 వరకు బీఎల్‌వోలకు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఆగస్టు 3 వరకు ఆగితే.. డిజిటలైజేషన్ చేసే సమయంలో సర్వర్ డౌన్ అయ్యే అవకాశం ఉందని అన్నారు.ఓటు హక్కుకు,సంక్షేమ పథకాలకు ఎలాంటి సంబంధం లేదని ఆయన వివరించారు.

# వర్షపు నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### సమన్వయంతో గ్రామాభివృద్ధికి కృషి చేయాలి: డిప్యూటీ జడ్పీ సీఈవో శ్రీనివాసరావు




**భీమదేవరపల్లి/జూలై 29 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి కమలాకర్ రెడ్డి అధ్యక్షతన బుధవారం గ్రామ సర్పంచులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డిప్యూటీ జడ్పీ సీఈవో శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై పలు అభివృద్ధి కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రతి గ్రామంలో తెలంగాణ జలసిరి కార్యక్రమం కింద ఇంకుడు గుంతలు, మ్యాజిక్ సోక్‌పిట్లు, ఫార్మ్ పాండ్లు వంటి వర్షపు నీటి సంరక్షణ పనులు చేపట్టి ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలని అధికారులు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లుగా గుడిసెలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని డిప్యూటీ జడ్పీ సీఈవో శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజేష్ మాట్లాడుతూ, మండలంలోని మల్లారం రెవెన్యూ గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు కోసం దాదాపు 30 ఎకరాల భూసేకరణ పూర్తయిందని తెలిపారు. అలాగే వంగర గ్రామంలో 10 ఎకరాల స్థలంలో సివిల్ సప్లై గోదాం నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. మండల కేంద్రంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నూతన భవనం నిర్మాణానికి స్థలం కేటాయింపు పూర్తైందని, త్వరలోనే శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇటీవల నిర్వహించిన ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన గ్రామ సర్పంచులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వీరేశం, తహసీల్దార్ రాజేష్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సర్పంచులు జాలి ప్రమోద్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, సిక ప్రదీప్, తిరుపతి, కల్పన, రమ, ఇన్‌చార్జి సర్పంచ్ మాట్ల హరికుమార్, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

# మాటలతో ముగుస్తుందా...
# మార్పు నాంది పలుకుతుందా...?

### మండల సర్వసభ సమావేశంపై గ్రామాలన్నింటి చూపు. -ప్రజా సమస్యలకు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని ప్రజల ఆకాంక్ష

**వర్ధన్నపేట/జూలై 29 (జర్నలిస్ట్ వార్త):**
వర్ధన్నపేట మండల సర్వసభ సమావేశం నేడు జరగనుంది. ఈ సమావేశంపై గ్రామాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఎప్పటికప్పుడు పేరుకుపోతున్న సమస్యలు, శాఖల మధ్య సమన్వయ లోపం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు.ఈసారి అయినా తమ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందా అని ఎదురుచూస్తున్నారు.

మండలంలోని పలు గ్రామాల్లో పాత డ్రైనేజీ కాలువలు శిథిలావస్థకు చేరుకుని మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. వర్షాలు కురిసిన ప్రతిసారీ దుర్వాసన, దోమల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫాగింగ్, పారిశుద్ధ్య చర్యలు కూడా ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వనాలు, మియావాకి, క్రీడా ప్రాంగణాలు నిర్వహణ లేక నిరుపయోగంగా మారుతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన ఆస్తులు పరిరక్షణ లేక వృథాగా మారకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మరోవైపు మండలంలోని అనేక గ్రామాల్లో అక్రమ మద్యం విక్రయాలు, గుడుంబా, గంజాయి అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత శాఖలు అప్పుడప్పుడు గుడుంబాపై దాడులు చేస్తున్నప్పటికీ, అక్రమ మద్యం, మత్తు పదార్థాల విక్రయాలను పూర్తిగా అరికట్టడంలో విఫలమవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఈ ఆరోపణలపై సంబంధిత శాఖల వివరణ రావాల్సి ఉంది. విద్యుత్ శాఖలో సిబ్బంది కొరత కారణంగా చిన్నచిన్న లోపాలు కూడా రోజుల తరబడి పరిష్కారం కావడం లేదని ప్రజలు చెబుతున్నారు. గ్రామాల్లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నా, స్తంభాలు దెబ్బతిన్నా వెంటనే స్పందన ఉండడం లేదని వాపోతున్నారు. తూనికలు, కొలతల నిబంధనలు పాటించని వ్యాపారులపై కూడా పర్యవేక్షణ బలహీనంగా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఇల్లంద గ్రామం నుండి రామ్‌దన్ తండా వైపు వెళ్లే రోడ్డు కంకర రోడ్డు ఉన్నందున ప్రయాణికులకు నిత్య నరకంగా మారిందని, ఈ రహదారిని బీటీ లేదా సీసీ రోడ్డుగా మార్చాలని ప్రజలు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా ఫలితం కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఎంపీపీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగకపోవడంతో మండల స్థాయి ఎన్నికైన ప్రజాప్రతినిధుల వ్యవస్థ లేకుండానే సర్వసభ జరుగుతోంది. ఈ పరిస్థితిలో గ్రామాల సమస్యలను ఎంత బలంగా చర్చిస్తారు? అధికారులు ఎలాంటి హామీలు ఇస్తారు? వాటి అమలుకు గడువులు నిర్ణయిస్తారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.సర్వసభ అంటే కేవలం శాఖల నివేదికలు చదివే సమావేశం కాదు. ప్రజల సమస్యలకు పరిష్కారాలు చూపే వేదిక. నేటి సమావేశంలో ఎమ్మెల్యే శాఖల అధికారులను జవాబుదారీగా నిలబెట్టి, సమస్యల పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందిస్తేనే ఈ సమావేశం ప్రజల ఆశలను నెరవేర్చినట్లవుతుందని మండల ప్రజలు ఆశాభావంతో ఎదురుచూస్తున్నారు.

### గ్రామాభివృద్ధికి రాజకీయ రంగు వద్దు..!

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వాల ప్రధాన లక్ష్యంగా ఉండాలని, రాజకీయాలకు అతీతంగా అన్ని గ్రామాలకు సమాన ప్రాధాన్యం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండల సర్వసభ సమావేశాలు రాజకీయ విమర్శలు, ప్రత్యారోపణలకు వేదికగా కాకుండా, గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపే ప్రజా వేదికగా మారాలని అభిప్రాయపడుతున్నారు. గ్రామ ప్రజలు చెల్లించే పన్నులు, ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులు ఏ పార్టీకి చెందిన గ్రామం అనే ప్రాతిపదికన కాకుండా, అవసరాల ఆధారంగా జరగాలని కోరుతున్నారు. ఈ సర్పంచ్ మా పార్టీ వారు ఆ సర్పంచ్ ప్రత్యర్థి పార్టీ వారు అనే భావన ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు సహజమే అయినప్పటికీ, అభివృద్ధి విషయంలో మాత్రం అన్ని గ్రామాలను సమానంగా చూడాల్సిన బాధ్యత పాలకులు, అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందని పేర్కొంటున్నారు.

ఇదిలా ఉండగా, నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కేటాయింపు, నిధుల పంపిణీపై కొన్ని వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీకి చెందని ప్రజాప్రతినిధులకు అభివృద్ధి పనులు, నిధులు తగిన స్థాయిలో అందడం లేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి, పనుల కేటాయింపు ప్రక్రియలో పారదర్శకతపై కూడా కొందరు సందేహాలు వ్యక్తం చేస్తున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. ఈ అంశాలపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదా ప్రకటన వెలువడలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, సంబంధిత అధికారులు అభివృద్ధి పనుల ఎంపిక, నిధుల కేటాయింపు, అమలు విధానంపై స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. పారదర్శకతతో నిర్ణయాలు తీసుకుంటే అనుమానాలకు తావు ఉండదని, ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు.

ప్రజలు ఎన్నుకున్న ప్రతి ప్రజాప్రతినిధి తన గ్రామ అభివృద్ధి కోసం మాట్లాడే హక్కు కలిగి ఉన్నారని, ప్రతి గ్రామానికి సమాన న్యాయం జరిగేలా చూడటం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత అని ప్రజలు గుర్తు చేస్తున్నారు. మండల సర్వసభలో రాజకీయ భేదాల కంటే ప్రజా సమస్యలకు ప్రాధాన్యం ఇచ్చి, గ్రామాల అభివృద్ధికి కార్యాచరణ రూపొందిస్తేనే ఆ సమావేశాల అసలు ఉద్దేశం నెరవేరుతుందని మండల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# మూడేళ్లుగా చేయూత కోసం ఎదురుచూపులు..!

### వర్ధన్నపేటలో 5,150 మందికి పెన్షన్లు.. మరో 508 మంది నిరీక్షణ
### ఇల్లండలో అత్యధిక లబ్ధిదారులు.. అదే గ్రామంలో ఎక్కువ పెండింగ్ దరఖాస్తులు







**వర్ధన్నపేట/జూలై 29 (జర్నలిస్ట్ వార్త):**
వర్ధన్నపేట మండలంలో ప్రస్తుతం 5,150 మంది సామాజిక భద్రత పెన్షన్లు పొందుతుండగా, మరో 508 మంది కొత్త పెన్షన్ కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం మారినా కొత్త పెన్షన్ల మంజూరుపై స్పష్టత లేకపోవడంతో అర్హులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పెన్షన్ పొందుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉన్న గ్రామాల్లోనే కొత్త దరఖాస్తులు కూడా అధికంగా ఉండటం గమనార్హం.

**ప్రస్తుతం అందుతున్న పెన్షన్లు (కేటగిరీల వారీగా)**

వృద్ధాప్య – 2,109
వితంతు – 1,870
వికలాంగులు – 694
ఒంటరి మహిళలు – 133
తాటి కార్మికులు – 245
ఇతరులు 88
మొత్తం లబ్ధిదారులు 5,150 మంది

మండలంలో ఎల్లంద (918), నల్లబెల్లి (532), దమ్మన్నపేట (528), కత్రియాల (437), ల్యాబర్తి (415), ఉప్పరపల్లి (395), చెన్నారం (362) గ్రామాల్లో అత్యధిక మంది ఇప్పటికే పెన్షన్లు పొందుతున్నారు. ఇదే గ్రామాల్లో కొత్త దరఖాస్తులు కూడా అధికంగా ఉండటం గమనించదగ్గ విషయం. ముఖ్యంగా ఇల్లండలో 97, దమ్మన్నపేటలో 63, ల్యాబర్తిలో 57, కత్రియాలలో 50 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటం వల్ల అర్హులు ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. సుమారు మూడేళ్లుగా కొత్త పెన్షన్లు మంజూరు కాకపోవడంతో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ వెంటనే పెన్షన్లు మంజూరు చేసి, పెండింగ్‌లో ఉన్న 508 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

**గ్రామాల వారీగా ప్రస్తుతం అందుతున్న పెన్షన్లు**

| | గ్రామం | ప్రస్తుతం పెన్షన్లు |
|---|---|---|
| 1. | అంబేద్కర్ నగర్ | 89 |
| 2. | బండోతాపురం | 321 |
| 3. | బొక్కలగూడెం | 90 |
| 4. | చంద్రు తండా | 51 |
| 5. | చెన్నారం | 362 |
| 6. | దమ్మన్నపేట | 528 |
| 7. | దివిటిపల్లి | 133 |
| 8. | ఇల్లంద | 918 |
| 9. | కడారిగూడెం | 127 |
| 10. | కాశగూడెం | 37 |
| 11. | కట్రియాల | 437 |
| 12. | కొత్తపల్లి | 290 |
| 13. | ల్యాబర్తి | 415 |
| 14. | నల్లబెల్లి | 532 |
| 15. | రామవరం | 228 |
| 16. | రందాన్ తండా | 127 |
| 17. | రామోజీ కుమ్మరిగూడెం తండా | 70 |
| 18. | ఉప్పరపల్లి | 395 |
| | మొత్తం | 5,125 |

**పెండింగ్ దరఖాస్తులు గ్రామాలవారీగా వివరాలు**

| | గ్రామం | పెండింగ్ దరఖాస్తులు |
|---|---|---|
| 1. | అంబేద్కర్ నగర్ | 10 |
| 2. | బండోతాపురం | 22 |
| 3. | బొక్కలగూడెం | 27 |
| 4. | చంద్రు తండా | 10 |
| 5. | చెన్నారం | 26 |
| 6. | దమ్మన్నపేట | 63 |
| 7. | దివిటిపల్లి | 9 |
| 8. | ఇల్లంద | 97 |
| 9. | కడారిగూడెం | 12 |
| 10. | కాశగూడెం | 14 |
| 11. | కట్రియాల | 50 |
| 12. | కొత్తపల్లి | 14 |
| 13. | ల్యాబర్తి | 57 |
| 14. | నల్లబెల్లి | 35 |
| 15. | రామవరం | 22 |
| 16. | రందాన్ తండా | 11 |
| 17. | రామోజీ కుమ్మరిగూడెం తండా | 12 |
| 18. | ఉప్పరపల్లి | 17 |
| | మొత్తం | 509 |

**పెండింగ్ దరఖాస్తుల విభజన**

| క్రమ సంఖ్య | వర్గం | పెండింగ్ దరఖాస్తులు |
|---|---|---|
| 1. | వితంతు | 191 |
| 2. | వృద్ధావ్య | 152 |
| 3. | వికలాంగులు | 122 |
| 4. | తాటి కార్మికులు | 30 |
| 5. | చేనేత కార్మికులు | 11 |
| 6. | ఒంటరి మహిళలు | 2 |
| | మొత్తం | 508 |

